# ఆలోకన - 1

సామాజిక - ఆధ్యాత్మిక వ్యాస సంపుటి

నీలంరాజు లక్ష్మీప్రసాద్

# ఆ లో క న

సామాజిక - ఆధ్యాత్మిక వ్యాస సంపుటి

*నీలంరాజు లక్ష్మీ ప్రసాద్*

విద్యార్థి మిత్ర ప్రచురణలు
కర్నూలు

**ఆలోకన**

నీలంరాజు  లక్ష్మీ ప్రసాద్
91/3 RT , విజయనగర కాలనీ, హైదరాబాద్ - 500 057
ఫోన్: 040-23346115

తొలి ముద్రణ : ఏప్రిల్ 2014

సర్వహక్కులు : రచయితవి

ప్రతులు:  2000

మూల్యము : రూ.50/-

ప్రతులకు : 1. విద్యార్థి మిత్ర ప్రచురణలు
ఫ్రెండ్స్ బుక్‌డిపో,
షాప్ నెం: 14, పార్కురోడ్,
మున్సిపల్ బిల్డింగ్స్, కర్నూలు - 518 001
సెల్ : 9441373304

2. నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా
కాచిగూడ, హైదరాబాద్ - 500 027,
ఫోన్:040-24652387

డి.టి.పి. : డి.దస్తగిరి, సెల్: 9293124826
కర్నూలు - 518002.

ముద్రణ : ఫ్రెండ్స్ ప్రింటర్స్ & బైండర్స్, కర్నూలు.
సెల్: 9440769009

# విషయ సూచిక


| | | | | |
|---|---|---|---|---|
| I. | ప్రచురణ కర్తల నివేదన | ... | ... | 2 |
| II. | ఒక దీపాలయం - ఒక దర్పణాలయం<br>- డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ | | ... | 4 |
| III. | ఆలోకనతో అనుబంధం-ఇంద్రకంటి వేంకటేశ్వర్లు ... | | | 11 |
| IV. | ఆలోకన | | | |
| 1. | శాస్త్రదర్శనం | ... | ... | 15 |
| 2. | భక్తుడికి భేదభావం ఉంటుందా ! | ... | ... | 18 |
| 3. | సద్యోస్ఫురణ | ... | ... | 21 |
| 4. | వైద్యోనారాయణో హరిః | ... | ... | 26 |
| 5. | స్వయంగా తెలిసిందెంత ? | ... | ... | 31 |
| 6. | మౌన సందేశం -1 | ... | ... | 34 |
| 7. | మౌన సందేశం -2 | ... | ... | 37 |
| 8. | నిజమైన ధార్మికత | ... | ... | 40 |
| 9. | అహింసా చరణ | ... | ... | 44 |
| 10. | ఆత్మజ్ఞానం - భేదభావం | ... | ... | 47 |
| 11. | ధనం తృణప్రాయం | ... | ... | 50 |
| 12. | నిశ్చయ జ్ఞాని వివేకానందుడు | ... | ... | 53 |
| 13. | మౌన సంభాషణ | ... | ... | 56 |
| 14. | విద్యార్థులపై ఎనలేని ప్రేమ | ... | ... | 59 |
| 15. | వివాహ వ్యవస్థ | ... | ... | 65 |
| 16. | ఎందుకీ వైరుధ్యం | ... | ... | 71 |
| 17. | గురుకర్తవ్యం | ... | ... | 74 |
| 18. | ఆస్తిక నాస్తిక చర్చ | ... | ... | 77 |
| 19. | బ్రహ్మ రాత | ... | ... | 83 |
| 20. | సజీవ వేదాలు | ... | ... | 86 |
| 21. | దైవారాధన - మానవారాధన | ... | ... | 90 |
| 22. | ప్రచ్ఛన్న యోగులు | ... | ... | 93 |

| | | | | |
|---|---|---|---|---|
| 23. | స్వగృహ స్పృహ | ... | ... | 96 |
| 24. | పతివ్రత - సాహసనారి | ... | ... | 99 |
| 25. | విగ్రహారాధన | ... | ... | 102 |
| 26. | బాహ్యరూపం - అంతస్సౌందర్యం | ... | ... | 105 |
| 27. | వినూత్న ఆలయాలు | ... | ... | 108 |
| 28. | శిక్షను కోరుకునే ఔన్నత్యం | ... | ... | 111 |
| 29. | ప్రార్థనల్లో బేరసారాలు | ... | ... | 115 |
| 30. | భజన సర్కస్ | ... | ... | 118 |
| 31. | ప్రచారం కోరని దేశసేవకుడు | ... | ... | 121 |
| 32. | బ్రహ్మజ్ఞానం | ... | ... | 124 |
| 33. | మతాన్ని మించిన మహనీయులు | ... | ... | 127 |
| 34. | ప్రజాసేవ | ... | ... | 130 |
| 35. | కరుణే దైవం | ... | ... | 133 |
| 36. | పూజలో చిత్తశుద్ధి | ... | ... | 136 |
| 37. | గాంధీజీతో ఎన్‌కౌంటర్ | ... | ... | 139 |
| 38. | విశ్వేశ్వరయ్యలో విశేషం | ... | ... | 141 |
| 39. | దిశమార్చి చూడు | ... | ... | 143 |
| 40. | తొడిమ ఊడిన ఫలాలు | ... | ... | 146 |
| 41. | స్తుతి - నింద | ... | ... | 149 |
| 42. | రాష్ట్రపతి భవన్‌లో రాజాజి | ... | ... | 153 |
| 43. | రచనకు టైం టేబుల్ | ... | ... | 156 |
| 44. | ఆనాటి నాయక ద్వయం | ... | ... | 159 |
| 45. | సుపరిపాలన | ... | ... | 162 |
| 46. | అమరత్వం | ... | ... | 165 |
| 47. | మతాల చరిత్ర | ... | ... | 169 |
| 48. | జాతిపిత - నేతాజీ | ... | ... | 172 |
| 49. | మాటతీరు | ... | ... | 175 |

# 1. శాస్త్ర దర్శనం

భగవంతునికై పరితపించే హృదయాన్నే భగవంతుడు గుర్తిస్తాడు. ఈ ఆరాటం, ఈ ఆవేదన, ఈ ప్రతీక్ష ఏ భాషలో నిర్వహింపబడుతున్నది అనేది అప్రస్తుతం. ఆ భగవత్తత్వం ఒక మనిషి ఆకారంలో ఉన్నదని కానీ, దానికో భాషమీదే అభిమానమని కానీ అనుకోడం అసందర్భం. ఏ మనిషి హృదయమైతే ప్రేమతో కరుణతో నిండి ఉంటుందో, ఆ హృదయాన్ని అది పసిగట్టగలదు.

పవిత్ర గ్రంథాల పారాయణం అయినా, శాస్త్ర పఠనమయినా, శ్రవణ మయినా, ఈ ప్రేమప్లావిత హృదయాన్ని నెలకొల్పడానికి ఉద్దేశించినవే. ఇలాంటి హృదయం ఎలాంటి మూగప్రార్థన సలిపినప్పటికీ అది చేరవలసిన చోటుకి నేరుగా వెళ్ళి చేరుతుంటుంది. మానవ నిర్మితమైన భాషతో నిమిత్తం లేదు.

పదహారో శతాబ్దంలో మహారాష్ట్రలో జన్మించిన ఏక్‌నాథ్ గొప్ప భగవత్ ప్రేమికుడు. ఏక్‌నాథ్ కుమారుడు హరి పండిట్ బాగా చదువుకున్నాడు. కానీ ఆ చదువు అతడికి వినయాన్ని కలిగించే బదులు గర్వాన్ని తెచ్చి పెట్టింది. దీనికి తోడు మనిషికి మూర్ఖపు పట్టుదల కూడా ఉండేది. శాస్త్రాలను తన తండ్రి ఏక్‌నాథ్ మరాఠీ భాషలో చెప్తూ ఉండడం కుమారుడికి ఎంతమాత్రం సమ్మతంగా ఉండేది కాదు. తండ్రిమీద ఉన్న ప్రేమకొద్దీ బహిరంగంగా ఆయన్ని విమర్శించడం బాగుండదని ఊరుకునేవాడు; కానీ ఈ మరాఠీ ప్రవచనం మూలాన తన తండ్రి ఉండే ఊళ్ళో నివసించడం కూడా అతడికి ఇష్టం లేకుండా పోయింది. అందువల్ల భార్యాపిల్లలతో కాశీకి వెళ్ళి పోవాలని నిశ్చయించుకున్నాడు.

‘ కాశీకి ఎందుకు? ’ అని ఏక్‌నాథ్ కుమారుణ్ణి అడుగగా, “ నేనిక్కడికి మళ్ళీ రాదలుచుకో లేదు. మీరు శాస్త్రాలను మరాఠీ భాషలో చెప్పి వాటిని ఆ విధంగా అపవిత్రం చేయడం నేను సహించలేకుండా ఉన్నాను. నేనిక్కడినుండి వెళ్ళిపోతే మనిద్దరికీ సుఖంగా ఉంటుంది” అన్నాడు.

ఏక్‌నాథ్ అప్పటికి ఏమీ చేయలేక ఊరుకున్నాడు. కానీ మనసు ఉండబట్టలేక నాలుగేళ్ళ అనంతరం తానే కాశీకి వెళ్ళి, తమ స్వగ్రామమైన పైఠానాకు తిరిగి రమ్మని కొడుకుని కోరాడు. కానీ హరిపండిట్ ససేమిరా తిరిగి రానన్నాడు. అప్పుడు

ఏక్‌నాథ్, తన హృదయం అంగీకరించక పోయినప్పటికీ, కొడుకు మాట ప్రకారం తానిక శాస్త్రాలు, పురాణాలు మరాఠీ భాషలో వివరించననీ సంస్కృతంలోనే హరిపండిట్ బోధించే ఏర్పాటు గావిస్తాననీ చెప్పుకున్నాడు. అప్పుడు హరిపండిట్ తన మాట నెగ్గినందుకు సంతోషిస్తూ పైఠానాకు తిరిగి వచ్చాడు. పురాణాలను దేవభాష అయిన సంస్కృతంలోనే వివరిస్తూ అభిభాషిస్తూ ఉండేవాడు. అయితే, రోజురోజుకూ శ్రోతల సంఖ్య తగ్గిపోవనారంభించింది. మరికొన్ని రోజులు గడిచేటప్పటికి అసలు శ్రోతలే కరవైపోయారు. అయినా వెనుదీయక హరిపండిట్ తన ఉపదేశాలు కొనసాగిస్తూనే ఉండేవాడు. “ మీ మరాఠీ ప్రసంగాలు తిరిగి మీరు కొనసాగించండి స్వామీ ” అని ప్రజలు ఏక్‌నాథ్‌ను అభ్యర్థిస్తుండేవారు.

ఇదిలా ఉండగా, ఓనాడు ఓ ముసలావిడ ఏక్‌నాథ్ వద్దకు వచ్చి, తన చిరకాల వాంఛను ఆయనతో విన్నవించుకున్నది. ఒకప్పుడు భాగ్యవంతురాలైన ఆ వృద్ధురాలు వేయిమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలని ఆ రోజుల్లో అనుకుంటుండేదిట. కానీ విధి వక్రించిన కారణాన, ఆమెకాభాగ్యమంతా పోయి ఇప్పుడు పేదరికంలో జీవిస్తున్నది. అందువల్ల ఈ దశలో తాననుకున్న విధంగా అందరికి భోజనం పెట్టగలిగిలేదు. కానీ ఆమె దృష్టిలో భక్తుడైన ఏక్‌నాథ్ వేలాది బ్రాహ్మణులకు మించినవాడు కాబట్టి, ఆయన తన కోర్కెను మన్నించి తన ఇంట అతిథ్యం స్వీకరించాలంటూ అతణ్ణి వచ్చి అడిగింది.

తన కొడుక్కు ఇష్టం లేదని, తన ఇల్లు దాటి ఊళ్ళోకి ఎక్కడకు వెళ్ళనని ఏక్‌నాథ్ హరిపండిట్‌కు మాట ఇచ్చి ఉన్నాడు. ఆ విషయమే వృద్ధురాలికి చెప్పాడు. ఆమె ఆశాభంగం చెంది చాలా దుఃఖితురాలయింది. ఆ వృద్ధురాలి అవస్థ చూడలేక, అపద్ధర్మంగా ఆమె ఇంటికి వచ్చేందుకు అంగీకరించాడు ఏక్‌నాథ్. ఆమె వెళ్ళి హరిపండిట్‌కు కూడా తన విషయమంతా చెప్పుకున్నది. హరిపండిట్ ఆమెమీద జాలిపడి, ఆమెకు వంటలో తాను వచ్చి సహాయపడతానని చెప్పాడు. ఆవిడ సరేనంటూ సంతోషంగా వెళ్ళింది.

మర్నాడు, హరిపండిట్ ఆ వృద్ధురాలి ఇంట్లోని చిన్న వంటగదిలో వంట వండాడు. అటు తర్వాత ఆవిడ తండ్రీ కొడుకుల్ని ఇద్దరినీ ఒక చోట కూచోబెట్టి, ఆకుల్లో అన్నమూ ఇతర పదార్థాలూ వడ్డించింది. కానీ వృద్ధురాలు రహస్యంగా తనంతట తానే తయారు చేసిన ఏదో వంటకం ఓ చిన్న గిన్నెలో పెట్టి, ఏక్‌నాథ్ ఆకుమీద పెట్టడం హరిపండిట్ గమనించాడు. హరిపండిట్‌కు వృద్ధురాలిచర్య ఎంత

మాత్రం నచ్చ లేదు కానీ అప్పటికి ఏమీ అనకుండా ఊరుకున్నాడు.

తండ్రీకొడుకులిద్దరూ భోజనం చేసిన తర్వాత చేతులు కడుక్కోడానికి లేచినప్పుడు, ఎంగిలి ఆకుల వంక చూస్తూ ఏక్‌నాథ్, “ వృద్ధురాలు వంగి ఈ ఆకులు ఎత్తేసే అవస్థ కలిగించకుండా నీవే తీసేస్తే సరిపోతుందేమో” నని కొడుక్కి సలహా ఇచ్చాడు.

అలాగేనంటూ హరిపండిట్ తండ్రి ఎంగిలాకు తీయడానికి ప్రయత్నించగా, దాని క్రింద మరో ఆకు కనిపించింది. వృద్ధురాలు బహుశా ఒకటి వేయబోయి పొరపాట్న రెండు ఆకులు వేసి వడ్డించి ఉంటుందని అనుకొని, హరిపండిట్ రెండో ఆకు కూడా చేతికి తీసుకున్నాడు. కానీ దానికింద మూడోది, ఆ తర్వాత మరొకటి ప్రత్యక్షమవజొచ్చినై, తీసి తీసి అలసిపోతున్న హరిపండిట్ మొత్తం వేయి ఆకులు తీసి పారేయ్యవలసి వచ్చింది. అప్పుడుగానీ ఆ విచిత్రం ఆగలేదు.

పురాణాల్లోని అక్షర సముదాయం ఏ భాషలో ఉన్నదనేది ముఖ్యం కాదు; కానీ వాటిని దర్శించిన తీరు అర్థం చేసుకున్న వైనం, ఆ మాటలపైన ఉండే శ్రద్ధా, ఇవే ముఖ్యమని హరిపండిట్‌కు చటుక్కున స్ఫురించింది.

తన తండ్రి అస్పృశ్యులనబడేవారి నిషిద్ధ ఆహారాన్ని ముట్టుకోవడానికి సంకోచించడు; వారికి అర్థమయ్యే మరాఠీ భాషలో ప్రసంగించడానికి వెనుకాడడు; ఇలా అనాచారంగా బ్రతుకుతున్నప్పటికీ తన తండ్రి, వేయిమంది బ్రాహ్మల పెట్టు అని హరిపండిట్ గ్రహించాడు. తనకున్న పరిమిత జ్ఞానంతో ఆర్భాటంగా తాను చేసే సంస్కృత ప్రసంగాలు ఎందుకూ కొరగాకుండా పోయినై అనే విషయం కూడా అతడికి అర్థమైంది.

వెంటనే ఆయన కాళ్ళమీద పడ్డాడు. తండ్రి కొడుకును లేవదీస్తూ, “ నువు శాస్త్రాలు క్షుణ్ణంగా నేర్చావే కానీ, హరీ! నీకొకింత వినయం కూడా అబ్బినట్లైతే బాగుండేది. అది లేనందువల్లనే వాటిని నువ్వు విడమర్చి చెప్పలేక పోయావు. కానీ ఇప్పుడిక ఫరవాలేదు. భక్తి శ్రద్ధలు, వినయమూ ఉన్నవారికి శాస్త్రాలు, ఇట్టే కరతలామలకమయిపోతై, లే నాయనా ” అని దీవించాడు ఏక్‌నాథ్.

“తండ్రీ, నా అపరాధాన్ని మన్నించండి. ఇకనుండి మీ చిత్తమొచ్చినట్లు మరాఠీ భాషలోనే ప్రవచించండి. ఈ ఊళ్ళో మీరు ఎవరింట్లో భోజనం చేయదలుచు కుంటే వారింట్లో చేయండి. అడ్డం రావడానికి నేనెంతటివాణ్ణి?” అన్నాడు హరిపండిట్.

# 2. భక్తుడికి భేదభావం ఉంటుందా?

ప్రతి మతంలోనూ సంప్రదాయాన్ని చాలా జాగ్రత్తగా అనుసరించే వారుంటారు. పూజా పురస్కార విధులు ఒక పద్ధతిగా నిర్వహిస్తూ ఉంటారు. మత గురువులు, పూజార్లు సూచించే కర్మకాండ యావత్తూ తు.చ. తప్పకుండా ఆచరిస్తుంటారు. మడీ, ఆచారాల మీద అమిత పట్టుదల ప్రదర్శిస్తుంటారు.

వీటన్నింటినీ ఇంత శ్రద్ధగా అనుసరించినందువల్ల వీరికి దైవం అనండి, ఆత్మ అనండి, అలాంటి దేదైనా సాక్షాత్కరించిందా అంటే అది సందేహాస్పదమే. పైగా మానవ నిర్మితమైన ఈ ఆచారాలన్నీ పాటించడం వల్ల మనిషిలో ఒక విధమైన గర్వం చోటు చేసుకుని అసలు మానవత్వమే కోల్పోవడం జరుగుతుంది.

పదహారవ శతాబ్దం ద్వితీయార్ధంలో మహారాష్ట్రలో జీవించిన ఏక్‌నాథ్ మహాభక్తుడే కాక గొప్ప మానవతా వాది కూడాను. వృద్ధాప్యంలో ఏక్‌నాథ్ ఒకమారు స్నానానికని నదికి వెళ్ళాడు. అదే వేళలో ఒక దళిత స్త్రీ కడవతో నీళ్ళు తెచ్చుకోవడానికి నది వద్దకు వచ్చింది. చంకన ఉన్న శిశువును అక్కడ ఇసుకలో పరుండబెట్టి నదిలో నీరు ముంచుకొని ఎలా మరిచిపోయిందో శిశువును మరచి కడవతో తన ఇంటికి వెళ్ళిపోయింది. ఏక్‌నాథ్ తన స్నానం ముగించుకుని నది బయటికి వచ్చేసరికి శిశువు ఏడుపు వినిపించింది. అప్పుడా శిశువును మృదువుగా తన చేతుల్లోకి తీసుకుని వూళ్ళోకి వెళ్ళి ఆ శిశువును దాని తల్లికి అప్పజెప్పాడు. మళ్ళీ నది వద్దకు వెళ్ళి నీటిలో స్నానం చేసి తన ఇంటికి తిరిగి వచ్చాడు.

ఆనాటి బ్రాహ్మణ సమాజంలో ఏక్‌నాథ్ చేసిన ఈ పని – అనగా దళిత శిశువును ముట్టుకోవడం చాలా పెద్ద తప్పిదంగా కనిపించింది " భానుదాస్ వంటి పరమ శ్రోత్రీయుడైన వంశానికి చెందిన ఏక్‌నాథ్ వంశ ప్రతిష్ఠను గంగలో కలిపాడు. ఇతడేమి బ్రాహ్మణుడండీ?" అంటూ తీవ్రంగా విమర్శించారు.

ఏక్‌నాథ్ చేత సంపూర్ణ శుద్ధి జరిపించాలి అని నిర్ణయించారు. " నాకింకా ఏమి శుద్ధి జరగాలి? శిశువును తల్లికి అప్పజెప్పిన తర్వాత మళ్ళీ నదిలోకి వెళ్ళి స్నానమాడి వచ్చాను కదా?" అన్నాడు ఏక్‌నాథ్. కానీ అది చాలదని ఆచార వంతుల

అభిప్రాయం. ఆచారాన్ని తృణీకరించే ఈ ఏక్‌నాథ్‌కు ఏదో ఒక నెపం మీద మరణ శిక్ష విధించేయడం అవసరమని వారు భావించారు.

వీరితో పడలేక ఈ నైష్ఠికులను సంతృప్తి పరచడానికి, వృద్ధుడైన ఏక్‌నాథ్ అప్పటికే అలసిపోయిన తన శరీరాన్ని ఈడ్చుకుంటూ ప్రాయశ్చిత్తం చేసుకోవడానికని నది వద్దకు మరోసారి వెళ్ళాడు. అదే సమయాన కుష్ఠురోగ పీడితుడైన ఒక బ్రాహ్మణుడు హడావుడిగా ఏక్‌నాథ్ వద్దకు వచ్చి ఆయనకు సాష్టాంగపడ్డాడు. వారిద్దరి చుట్టూ కొందరు ప్రజలు మూగారు.

" పన్నెండేళ్ళ నుండీ నేనీ నయంకాని వ్యాధితో బాధపడుతున్నాను. త్రియంబకేశ్వర్‌లో నేను తపస్సు చేస్తూ ఉండగా నాకో కల వచ్చింది. ఆ కలలో పైఠాన్‌కు చెందిన ఏక్‌నాథ్ అనే సాధు పురుషుడు మహర్ జాతికి చెందిన శిశువును తన చేతుల్తో తీసుకువెళ్ళి తల్లికిచ్చినందువల్ల లభించిన పుణ్యాన్ని త్యజించడానికి సిద్ధపడితే నా వ్యాధి నయమవుతుదని ఏదో వాణి వినిపించింది" అన్నాడు ఆ రోగి.

వినయ సంపన్నుడైన ఏక్‌నాథ్ తన సహజ స్వభావంతో " పుణ్య పాపాలనేవి నాకు తెలియవు. కానీ నీకు ఉపయోగపడుతుందనుకుంటే నేను సంపాయించాననుకుంటున్న పుణ్యమేదైనప్పటికీ అది నీకు ఇప్పుడే ధారపోస్తున్నాను" అన్నాడు. అలా అంటూ తన చేతిని ఆ కుష్ఠు రోగి చేతిలో ఉంచాడు. వ్యాధిగ్రస్తుడు, వ్యాధి నిర్మూలితుడై నిలబడ్డాడు.

అంతకు ముందు ఇష్టమొచ్చిన రీతిగా తమ ఆగ్రహాన్ని వెలిగక్కిన బ్రాహ్మణులందరూ సిగ్గుతో ముఖం చాటేసుకుని తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

దైవాన్ని దర్శించిన ఏక్‌నాథ్‌కు కులమత తేడాలు ఎలా ఉంటై? భేద భావం, అది ఏ రకమైన భేదమైనా సరే జాతి భేదం కానీ, ధనిక నిర్ధన భేదం కాని, స్త్రీ పురుష భేదం కానీ, పాప పుణ్య భేదం కానీ, స్వర్గ నరకాల భేదం కానీ, ఏ భేదం పాటించినా దైవ దర్శనం జరిగే వీలు లేదు. మానవుని ఆలోచనలో నుండి బయలు దేరిన ఈ భేద భావం, సృష్టిలో లేని ఈ భేదం, నిజంగా లేదు' అని కనుగొంటేనే దైవదర్శనం సాధ్యం.

ప్రాణికోటి ఎడల దయ చూపించవలసి వచ్చినప్పుడు ఏక్‌నాథ్‌కు స్వపర భేదం కూడా ఉన్నట్లు కనిపించదు. తుఫాను చెలరేగుతున్న ఒక రాత్రి, ఒక వృద్ధ బ్రాహ్మణుడు బజార్లో చిక్కుకుని నానా అవస్థలకు గురవుతుండగా " అదుగో అక్కడ

ఏక్‌నాథ్ ఇల్లు ఉన్నది వెళ్ళు" అని ఊళ్ళో వాళ్ళు సలహా ఇచ్చారు. నిజానికి అతనెవరో పరాయివాడు ; ఏక్‌నాథ్ అతన్ని ఎరగడు. కానీ ఆ వ్యక్తి వర్షంలో ముద్దగా తడిసి లోనికి రావడం చూసి నిప్పు రాజేసి అతనికి అన్నం వండి పెట్టమని భార్య గిరిజాబాయిని ఆదేశించి అతడి తడి గుడ్డలు ఆరేసుకోమని తన వద్ద నున్న పొడి గుడ్డలు ఇచ్చాడు. కానీ వర్షానికి ఇంట్లో ఉన్న కట్టెల మోపు పూర్తిగా తడిసి పోయినందువల్ల ఆమెకు అన్నం ఎలా వండి పెట్టాలో పాలుపోక అటూ ఇటూ తిరుగుతున్నది. ఆ తడిసిన కట్టెలతో ఎంత ప్రయత్నం చేసినా అవి మండలేదు.

ఎదుటి ప్రాణి బాధను చూడలేని ఏక్‌నాథ్ మంచం కోళ్ళు ఊడదీసి వాటిని మండించి వండి పెట్టమని భార్య నాదేశించాడు.

అంటే అభాగ్యుడైన ఆ వృద్ధుడి బాధ తన బాధగా 'ఫీ'లయ్యాడన్నమాట. దీనినే ఆంగ్లంలో 'Empathy' అంటారు. మనిషిలో ఎంతో సున్నితత్త్వం ఉంటేగాని ఇది సంభవించదు. కానీ ఆ సున్నితత్త్వం ఏర్పడందే దైవదర్శనం జరగదు.

నిజానికి ఆ దైవానికుండే ప్రధాన లక్షణం కూడా ఇదేననిపిస్తుంది. పరమ భక్తుడి బాధ తన బాధగానే భావించడం అందుకే దైవానికి జరుగుతుంటుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Alokana+1**

* * *